
కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం



కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

నారాయణపేట, న్యూస్‌టుడే: తెలంగాణ సమాజంలో జన్మించిన ఆణిముత్యం కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వెనకబడిన తరగతులు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాట యోధుడు, తెలంగాణవాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ తుది శ్వాస వరకు అంకిత భావం, నిజాయతీగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయ అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుమోహన్, సంబంధిత అధికారులు ఖలీల్, ఏవో జయసుధ, డీపీఆర్వో రషీద్, వసతి గృహాల వార్డెన్‌లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో.. : జిల్లా పోలీసు కార్యాలయంలో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ యోగేష్ గౌతం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహ, డీపీవో సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఆర్ఎస్సైలు శివశంకర్, రాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ ఇస్తామన్నా రారే!

నెరవేరని పండ్లతోటల పెంపకం లక్ష్యం

న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్



ధన్వాడలో సాగు చేసిన జామ తోట

జిల్లాలో పండ్ల తోటల పెంకానికి రైతులు ముందుకు రావడంలేదు. 2024-25 ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యానికి సగం దూరంలోనే ఆగిపోయింది. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా ఆసక్తి చూపడం లేదు. విస్తీర్ణం తక్కువగా ఉండటం, ఫలితాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి రావడమే అనాసక్తతకు కారణాలుగా చెబుతున్నారు. పెద్ద రైతులకు ఆసక్తి ఉన్నా వారికి రాయితీ వర్తించదు.

● జిల్లాలో మొత్తం 280 పంచాయతీలు ఉండగా.. వీటిలో ఈ ఏడాది 9 వందల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకు 487.33 ఎకరాల్లో 271 మంది రైతులే తోటల పెంపకానికి ముందుకు వచ్చారు. వీటిలో 253 రైతులకు సంబంధించి 456.78 ఎకరాల్లో అంచనాలు తయారు చేయడం పూర్తయ్యింది. 154 మంది రైతులకు చెందిన 268.91 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు గుంతలు తీశారు. 123 మంది రైతులకు చెందిన 207.35 ఎకరాల్లో 35,769 పండ్ల మొక్కలు నాటడం పూర్తయ్యింది. నాటిన వాటిలో మామిడి, జామ, బత్తాయి, సపోట, దానిమ్మ, కొబ్బరి, డ్రాగన్ రకాలు ఉన్నాయి.

దరఖాస్తుల కోసం ఎదురుచూపులు : జిల్లా వ్యాప్తంగా 412.67 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం ఇంకా చేపట్టాల్సి ఉంది. ఇందుకు ఆయా మండలాల్లో అధికారులు దరఖాస్తుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరూ ముందుకు రావడం లేదు. చిన్న, సన్నకారు రైతులకు పూర్తిరాయితీ వర్తింపజేస్తున్నారు. పెద్ద రైతులకు తోటల పెంపకానికి రాయితీ వర్తింప చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మొగులప్పతో మాట్లాడగా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గడువులోగా లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జిల్లాలో 2024-25 లక్ష్యం ఇలా..

మండలం	పంచాయతీలు	లక్ష్యం (ఎకరాల్లో..)
దామరగిద్ద	30	100
ధన్వాడ	20	60
కోస్గి	26	120
కృష్ణా	13	40
మద్దూరు	49	100
మాగనూరు	16	50
మక్తల్	39	150
మరికల్	17	50
నారాయణపేట	28	100
నర్వ	19	60
ఊట్కూరు	23	70

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే



గ్యాస్ రాయితీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్‌కు సంబంధించి రూ.500లకు రాయితీ పత్రాలను మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సదాశివారెడ్డి, ఉపాధ్యక్షుడు కొనంగేరి హన్మంతు, గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి కీర్తి పాల్గొన్నారు.

పాలమూరులోనే అత్యధిక వర్షపాతం

భూగర్భ జలాలు మెరుగు పడ్డా పెరగని సాగు


ఈనాడు, మహబూబ్‌నగర్: ఈ వానా కాలం సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన మొదటి ఐదు జిల్లాలు పాలమూరుకు చెందినవే. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో మాత్రమే అధిక వర్షాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం సగటున 452.56 మి.మీటర్లు ఉండగా ఇప్పటి వరకు 852.34 మి.మీటర్ల నమోదయ్యింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో సాధారణం, ఓ మోస్తరు వర్షపాతాలే నమోదయ్యాయి. అధిక వర్షపాతంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. ఒక్క నెలలోనే మహబూబ్‌నగర్‌లో 1.52 మీటర్లు, నాగర్‌కర్నూల్-0.97, నారాయణపేట-1.55, వనపర్తి-2.50, జోగులాంబ గద్వాల-2.48 మీటర్ల మేర భూగర్భ జలాలు పైకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైనా సాగు విస్తీర్ణం పెరగలేదు. రాష్ట్రంలోనే సాధారణ విస్తీర్ణంలో తక్కువ సాగైన జిల్లాలో మొదటి స్థానంలో నాగర్‌కర్నూల్ ఉంది. ఈ జిల్లాలో 77.65 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. గద్వాల జిల్లాలో 87.64 శాతం పంటలే సాగయ్యాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లోనూ పూర్తిస్థాయిలో సాగు చేపట్టలేదు. వ్యవసాయ శాఖ తాజాగా విడుదల చేసిన గణంకాల్లో ఈ వివరాలను వెల్లడించారు.



దేవరకద్రలో సాగవుతున్న వరి

పంటలు ఇలా.. (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగైంది
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
జోగులాంబ గద్వాల	3,37,011	2,95,340
వనపర్తి	2,40,233	2,29,588
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
నారాయణపేట	4,27,260	4,22,585



90.17 శాతమే..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 18.65 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 16.82 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. సాధారణ సాగులో 90.17 శాతం మాత్రమే సాగయ్యింది. ఇందులో వరి 7.64 లక్షల ఎకరాల్లో సాగుయ్యింది. పత్తి-6 లక్షలు, కంది-1.30 లక్షలు, జొన్న-30 వేలు, మొక్కజొన్న-80 వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం కొంత వరకు తగ్గింది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, గద్వాలలో సాగు విస్తీర్ణం తగ్గడంతో ఉమ్మడి జిల్లాలో సాధారణ సాగుపై ప్రభావం చూపుతోంది. ఈ రెండు జిల్లాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ఈసారి పత్తి సాగు తగ్గింది. భారీ వర్షాలతో ఈ పంటకు తెగుళ్లు రావడం, సీజన్ ప్రారంభంలో అనుకున్న స్థాయిలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగుపై ప్రభావం పడింది.



పంట ఆరబోశారు.. జారితే ఏం చేస్తారు?

నేటి చిత్రం

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికి అంది వస్తున్నాయి. కోత కోసిన పంటను ఆరబెట్టుకోడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు పడుతుండటంతో చేతికొచ్చిన పంట ఎక్కడ పాడవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసీ రహదారులపైనే పంటను ఆరబోసుకుంటున్నారు. జడ్చర్ల మండలం కొత్తతండాలో రైతులు జొన్న పంటను జాతీయ రహదారి-167పై ఆరబోసుకున్న వైనాన్ని 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

-ఈనాడు, మహబూబ్‌నగర్

ఆనందమానందమాయె!

● 2008 డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల
● ఉమ్మడి జిల్లాలో 361 మందికి అవకాశం



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో నివసిస్తున్నారు. భర్త ఓ ప్రైవేట్ ఉద్యోగి. 2008 డీఎస్సీలో 56.5 శాతం మార్కులు పొంది 2,791వ ర్యాంకు సాధించారు. కానీ అప్పుడు ఉద్యోగం రాలేదు. దీంతో రెసిడెన్షియల్ పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తుంటే అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులు రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. ప్రస్తుతం ఆమె వయస్సు 53 ఏళ్లు. రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. **- ఉమ**



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నివసిస్తున్నారు. 2008 డీఎస్సీలో 58.5 మార్కులు పొంది 2,294వ ర్యాంకు సాధించారు. 59 మార్కుల వద్ద అప్పుడు కటాఫ్ నిర్ణయించడంతో ఉద్యోగం రాలేదు. అనంతరం పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేశారు. ప్రభుత్వం 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక ఉపాధ్యాయులుగా తీసుకుంటామని ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. **- నరేశ్**



అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఈవో కార్యాలయ అధికారులు

పాలమూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 2008 డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు 361 మంది ఉన్నారు. వారందరికి ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమించడానికి రేవంత్ సర్కార్ అనుమతించడంతో సంబంధించిన విద్యార్హతల పరిశీలన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువ పత్రాలను విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పరిశీలిస్తున్నారు. విశేషమేంటంటే 361 మందిలో అనేక మందికి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వయస్సు గడువు తీరిపోయింది. వారంతా ఆయా పనులు చేసుకుంటూ ప్రస్తుతం ఉపాధిని పొందుతున్నారు. పలువురు డీఎస్సీతో రాకపోవడంతో ఇతర ఉద్యోగ ప్రకటనలకు దరఖాస్తులు చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. కానిస్టేబుళ్లు, పంచాయతీ కార్యదర్శులు, గురుకులాలు, కేజీబీవీలు, గ్రూప్స్ పోటీ పరీక్షలు రాసి విజయం సాధించారు. ఈ 2008 డీఎస్సీ అర్హత జాబితాలో దాదాపు 100 కంటే ఎక్కువగానే ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని పలువురు అభ్యర్థులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తొలిరోజు 82 మంది అభ్యర్థులు హాజరు... : జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువ పత్రాలను పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. తొలిరోజు కేవలం 82 మంది మాత్రమే పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. డీఈవో కార్యాలయంలో అధికారులు 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి అభ్యర్థులు తరలివచ్చారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తరువాత అభ్యర్థుల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులకు జాబితాను సమర్పించనున్నారు. అనంతరం వారిని ఆయా ఖాళీగా ఉన్న స్థానాల్లో తాత్కాలిక పద్ధతిపై నియమించనున్నారు.

అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలు ఇస్తాం.. : అభ్యర్థులకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే రానున్నాయి. వేతనం, సర్వీస్, ఇతర అంశాలన్నింటిపై కొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలిన అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. అక్కడ నుంచి అనుమతులు వచ్చిన తర్వాత నియామక పత్రాలను అందజేస్తాం. **- రవీందర్, డీఈవో**

రూ. 8.16 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం



మహాజన సభలో మాట్లాడుతున్న వెంకట్రామారెడ్డి

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక సింగిల్ విండో ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మహాజన సభలో 2024-25 ఏడాదికి రూ. 8.16 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రూ. 3 కోట్ల స్వల్పకాలిక రూ. 2 కోట్ల దీర్ఘకాలిక రుణాలు రైతులకు అందజేయాలని నిర్ణయించారు. వ్యాపార రుణాలకు రూ. కోటి కేటాయించారు. విండో ద్వారానే ఎరువుల దుకాణాన్ని ఏర్పాటు చేసేందుకు రూ. 15 లక్షలు కేటాయించారు. ఈసారి విండో పరిధిలోని ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కంది పంటను కూడా కొంటామన్నారు. అన్ని రకాల వడ్లకు రూ.500 రాయితీ అందించాలని తీర్మానం చేశారు. రూ. లక్ష, రూ.2లక్షల రుణమాఫీని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని కోరుతూ మరో తీర్మానం చేశారు. ఉపాధ్యక్షుడు గండి బాల్‌రాజు, పేట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, లక్ష్మయ్యగౌడ్, ర్యాగానాయక్, విండో డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



పింఛన్ కోసం తంతి తపాలా కార్యాలయం ముందు ఎదురుచూస్తున్న వృద్ధులు

మారిన తీరు.. లబ్ధిదారులు బేజారు

ధన్వాడ, న్యూస్‌టుడే : పోస్టాఫీసులో పింఛన్లు అందుకునే లబ్ధిదారులు అగచాట్లు పడుతున్నారు. గతంలో వీధి వీధికీ యంత్రాలను ఏర్పాటు చేసి రెండు, మూడు రోజుల్లోనే పంపిణీని పూర్తి చేసేవారు. ఇప్పుడు కార్యాలయాలకు రప్పిస్తున్నారు. ఎక్కువ యంత్రాలను పెట్టకుండా ఒకటి రెండుతోనే సరిపెడుతూ లబ్ధిదారుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. సిగ్నల్స్ లేవంటూ తిప్పుతున్నారని వృద్ధులు వాపోతున్నారు.

నీటిపారుదల నిర్వహణ ఇక మెరుగు!

క్షేత్ర స్థాయి సిబ్బంది నియామకానికి పచ్చజెండా



రామన్‌పాడ్ జలాశయం కింద దేవర్‌పల్లి శివారులో అధ్వానంగా కుడి కాలువ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నీటిపారుదల నిర్వహణలో కీలకంగా ఉండే లస్కర్లు, సహాయకుల నియామకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన అన్నదాతల్లో ఆనందం నింపింది. వీరి నియామకంతో సాగునీటి జలాశయాలు, చెరువులు, కుంటల ఆయకట్టు కింద నీటి పారుదల నిర్వహణ మెరుగుపడనుంది. గురువారం రాష్ట్ర స్థాయిలో జరిగిన సాగునీటి సమీక్ష సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ప్రకటన వెలువడటంతో ఆయా జలాశయాల కింద పొలాలు, స్థిరాస్తి నష్టపోయిన బాధిత కుటుంబాలు, నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

● ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల, కోయిలసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి సాగునీటి పథకాల కింద లస్కర్లు, సహాయకుల నియామకాలు ఏళ్ల తరబడిగా చేపట్టలేదు. జూరాల జలాశయం నిర్మాణ పనుల్లో పాల్గొన్న మ్యాన్ మజ్దూర్లలో చాలా మంది పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో జీవో నెం.45 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 3,293 మంది లస్కర్లకు కేవలం 419 మంది, 728 మంది సహాయకులకు 196 మంది ఉన్నారని జులై 2016లో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రభుతానికి నివేదించారు. ● కొత్తగా లస్కర్లు, సహాయకుల ఖాళీలను భర్తీ చేయాలని 10 జూన్ 2021న ప్రతిపాదనలు పంపారు. గత ఏడాది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులను ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆయా నీటిపారుదల శాఖ సీఈ కార్యాలయాల పరిధిలో లస్కర్లు, సహాయకులను నియమించారు. ● నారాయణపేట డివిజన్‌కు 23 మందిని, వనపర్తి డివిజన్‌కు 124 మంది నియమించారు. అయినప్పటికీ లస్కర్లు, సహాయకుల కొరత తప్పడం లేదు. యాసంగిలో సాగునీటి పారుదలను నియంత్రించే సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు సమస్య ఏర్పడుతోంది.

మార్గదర్శకాలు ఇవీ..

● ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ. ఒకరు, ఉప కాలువ కింద ప్రతి 112 కి.మీ. ఒకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు ఒకరు చొప్పున లస్కర్లు విధులు నిర్వర్తించాలి. ● ప్రధాన కాలువపై ప్రతి ఐదు మంది లస్కర్లను ఒకరు, ఉపకాలువల కింద ప్రతి ఆరు మంది లస్కర్లపై ఒకరు చొప్పున సహాయకులను నియమించాల్సి ఉంటుంది. వీరి కొరత వల్ల ఈ మార్గదర్శకాలు అమలు కావడం లేదు. ● మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన నేపథ్యంలో కొత్తగా 281 మంది సహాయకులు, 1,597 మంది లస్కర్లను నియమించేందుకు చర్యలు తీసుకోనున్నారని నీటిపారుదల శాఖ అధికారులు భావిస్తున్నారు.

ఆదేశాల అనుగుణంగా చర్యలు : కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తాం.

- శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ, పెబ్బేర్ డివిజన్

నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలకు వెళ్లాలి

మంత్రి జూపల్లి



అధిక సంఖ్యలో యువ క్లబ్‌లు ఏర్పాటు చేసినందుకు మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయికి అవార్డు అందజేస్తున్న మంత్రి జూపల్లి, చిత్రంలో రమేష్‌రెడ్డి, వాణీ ప్రసాద్

మాదాపూర్, న్యూస్‌టుడే: జీవిత ముస్సెద్దు దాన్ని సాకారం చేసుకోవాలి. నిత్యం కుటుంబం, సంపాదనలో మునిగిపోకుండా కనీసం నెలకోసారైనా పర్యాటక ప్రదేశాలను చూసి ప్రశాంతంగా గడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. పర్యాటక ప్రదేశాల సందర్శనతో మనసుకు ఆనందం, ఆహ్లాదంతో పాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో ప్రపంచ పర్యాటక దినోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. పురాతన కట్టడాలు, కోటలు, దేవాలయాలు ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలున్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాలు పర్యాటకరంగంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చాలా మంది తమ నిత్యజీవిత పనుల్లో నిమగ్నమై దేశంలోని ఒక్కసారి కూడా పర్యాటక ప్రదేశాలను చూడలేక పోతున్నారు. నెలలో ఒక రోజు పర్యాటకానికి కేటాయించుకోవాలని చెప్పారు. తాను మంత్రి అయిన తర్వాత గోల్కొండ కోటను చూశానన్నారు. యునెస్కో గుర్తింపు రామప్ప లాంటి ఎన్నో కట్టడాలు, కళాఖండాలు, శిల్పసంపద తెలంగాణలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, కళాకారులు చూడముచ్చటైన కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, ఇక్కడి పర్యాటక ప్రదేశాలు, కట్టడాల విశిష్టతను చాటుతూ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అందరినీ అలరించారు. ఉద్వేగభరితంగా సాగిన జానపద కళలతో చూపరులను కట్టిపడేశారు.

పేర్కొన్నారు. తెలంగాణ దర్శిని పేరిట విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలను చూపిస్తున్నట్లు చెప్పారు. సముద్రం, ఇసుక తప్ప ఏమీ లేని దేశాలకు వెళ్లి రూ.లక్షలు ఖర్చుచేయడం కాదు, అద్భుతమైన కళాఖండాలు, చారిత్రక కట్టడాలు, కళల సంపద ఉన్న మన దేశంతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్‌లు తెలంగాణ పర్యాటకరంగానికి రాయబారులుగా వ్యవహరించాలని కోరారు.

• అనంతరం రాష్ట్రంలో అత్యధిక యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకుగాను వరంగల్ కలెక్టర్ సత్య శారద, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్‌లకు పర్యాటక శాఖ తరఫున మంత్రి జూపల్లి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బాక్సర్ నిఖత్‌జరీన్, షూటర్ ఇషాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల మెరుగుదలకు చర్యలు..

మూసీ రివర్ ఫ్రంట్‌ను అద్భుతంగా తయారు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకెళ్తుందని చెప్పారు. పర్యాటక ప్రదేశాల్లో వసతులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు

ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలి



రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ క్రీడాకారులకు మంచి వేదిక అని దీనిని సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయికి ఎదగాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎండీసీఏ మైదానంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్ర స్థాయి టోర్నీకి బయలుదేరిన ఉమ్మడి జిల్లా అండర్-19 జట్టును అభినందించారు. టోర్నీలో ప్రతిభ కనబరిస్తే కంబైన్డ్ జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం దక్కనుందన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు టి.సురేశ్ కుమార్, సంఘం సభ్యులు గోపాలకృష్ణ, అబ్దుల్లా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-19 టోర్నీ..: హన్మకొండలో శనివారం నుంచి అండర్-19 అంతర్ జిల్లాల టోర్నీ ప్రారంభం కానుంది. పూల్ 'ఎ'లో మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, నల్గొండ జట్లు.. పూల్ 'బి'లో నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జట్లున్నాయి. ఉమ్మడి జిల్లా జట్టులో.. అబ్దుల్ రాఫె, ఇ.అభిలాశ్ గౌడ్, జి.శశాంక్, ఎం.సాత్విక్ రెడ్డి, ఎండీ ముఖీత్, డి.అభినవ్, జి.చరణ్ తేజ్, ఎస్.అభినయ్ తేజ, షాదాబ్ అహ్మద్, డి.రాజు, కె.మనోజ్, బి.కనిష్క్, రాంచరణ్, ఎం.అర్జున్ రెడ్డి, అంకిత్ రెడ్డి, జి.వివేక్, వి.నగేశ్, కె.హరినాథ్ ఎంపికయ్యారు. శనివారం తొలి మ్యాచ్‌లో జిల్లా జట్టు ఆతిథ్య వరంగల్ జట్టుతో తలపడనుంది.

చేతిలో శత్రువు





• ఎలాంటి చెడు అలవాట్లు లేని 36 ఏళ్ల వ్యక్తి క్యాన్సర్ బారిన పడి చనిపోయాడు. మద్యం, గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్ వంటివి ఏనాడూ తీసుకోకున్నా క్యాన్సర్ మహమ్మారి అతని ప్రాణాలను తీసింది. వైద్యులు ఆయన శరీరాన్ని పరిశోధించగా ప్లాస్టిక్ కవర్లలో తెచ్చిన వేడి ఆహారాన్ని తినడం, ప్లాస్టిక్ సీసాలో నీటిని తాగడం వల్ల అందులోని రసాయనాలతో క్యాన్సర్ బారిన పడినట్లు తేల్చారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో తెచ్చిన వేడివేడి టీ ఆరుసార్లు తాగేవాడు. ప్లాస్టిక్ సీసాలు, బాక్స్‌ల్లో వేడి ఆహారాన్ని, నీటిని ఉంచి తాగొద్దని హైదరాబాద్‌కు ప్రముఖ వైద్యుడు డా.నాగేశ్వర్‌రెడ్డి ఈ విషయాన్ని తెలియజేశారు.

• పంజాబ్‌లో మరణించిన ఆవుకు శవపరీక్ష చేయగా కడుపులోంచి 26 కిలోల ప్లాస్టిక్ సంచులు బయటపడ్డాయి. మనుషులు ప్లాస్టిక్ కవర్లలో ఆహారాన్ని పారవేయగా, ఆవు ఆ ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లతో సహా తినేసింది. ఆ ప్లాస్టిక్ కవర్లు జీర్ణం కాలేక కడుపులో అలాగే ఉండిపోయి చివరకు దాని ప్రాణం తీశాయి.

• ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్లాస్టిక్‌ను నిషేధించామని అధికారులు చెబుతున్నా, అడపాదడపా దాడులు చేస్తున్నా ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం తగ్గడం లేదు.

న్యూస్‌టుడే, కోస్గి

ప్లాస్టిక్ లేకపోతే జీవితమే లేదు.. అన్నట్లుగా తయారయ్యింది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. చిన్న వస్తువు కొన్నా ప్లాస్టిక్ కవర్‌లో తీసుకువెళ్తున్నారు. బజారుకు వచ్చి పది వస్తువులు కొంటే వాటిని వేసుకునేందుకు నాలుగైదు కవర్లను ఆయా దుకాణదారుల నుంచి తీసుకుంటున్నారు. పిల్లలకు పాలు తాగించడానికి ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగిస్తున్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌పై, ఒకసారి వాడి పడేసే (సింగిల్ యూజ్) బాటిళ్లపైన నిషేధం ఉంది. దుకాణాలపై దాడులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మన దగ్గర వ్యర్థాల పోగులు : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 19 పురపాలక సంఘాల్లో రోజూ 310 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పోగవుతుండగా, అందులో 108.9 మెట్రిక్ టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.. కలెక్టర్‌గా వెంకట్రావు ఉన్న సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వనపర్తిలో శ్వేతా మహంతి కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రతి బుధవారం ప్లాస్టిక్ వినియోగం, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో మంచి ఫలితాలు రాగా ఆ తర్వాత అలాంటి కార్యక్రమాలు లేకుండా పోయాయి.



తిరుమల ఆదర్శం

కఠినంగా వ్యవహరించకుంటే విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి నిత్యం లక్షలాది భక్తులు తరలి వస్తారు. ఇక్కడ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించారు. కొండపైకి వెళ్లేటప్పుడు అలిపిరి వద్ద తనిఖీలు చేపడతారు. ప్లాస్టిక్ కవర్లు, తీసుకెళ్లనీయరు. మన పురపాలికలు ఇలా చేస్తే మేలు.

నిషేధ వస్తువులు ఇవే..

కేంద్ర ప్రభుత్వం 16 రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించింది. ఇందులో ఇయర్ బడ్స్, బెలూన్లు, క్యాండి, ఐస్‌క్రీం కోసం వాడే ప్లాస్టిక్ పుల్లలు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, కత్తులు, సిగరెట్ ప్యాకెట్లు, 100 మైక్రాన్లలోపు ఉండే పీవీసీ బ్యానర్లు, అలంకరణ కోసం వాడే థర్మాకోల్.

మార్పు మన నుంచే..

• మార్పు మన నుంచే మొదలవ్వాలి. నారాయణపేట జిల్లా ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా గుడ్డ సంచీలు తయారు చేసి తమతోపాటు తమ ఇళ్లల్లో వినియోగించేలా చూస్తున్నారు.

• నెలల తరబడి ఒకే టూత్ బ్రష్ వాడటం వల్ల ప్లాస్టిక్ రేణువులు శరీరంలోకి వెళతాయి. బ్రష్‌లు మార్చుకోవాలి. వీలైన వాళ్లు వేప, కాగు పుల్లలతో పళ్లు తోమడం అన్ని విధాలా మంచిది.

• పాఠ్యపుస్తకాల అట్టలకు ప్లాస్టిక్ పేపర్లు వాడే బదులు దినపత్రికలను, కాగితం కవర్లుగా వేయడం మంచిది. చిన్నారులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించవచ్చు. బ్యానర్లు, ఫ్లెక్సీలకు బదులుగా వస్త్రాల బ్యానర్లు వాడటం మంచిది.

బాధ్యత మనదే..

• నిత్యావసర సరకులు, కూరగాయలు తెచ్చేందుకు విధిగా గుడ్డ సంచులు తీసుకువెళ్లాలి. • మాంసం తెచ్చుకోడానికి స్టీల్ డబ్బాలను పట్టుకెళ్లడం మంచిది. బయట ప్రయాణించేటప్పుడు స్టీల్, రాగి సీసాలు ఉపయోగించాలి. • టీ, పండ్ల రసాలు, పానీయాలు తాగేటప్పుడు గాజు, కాగితపు గ్లాసులను వినియోగించాలి. • శుద్ధి చేసిన నీటిని డబ్బాలలో తీసుకోవడంకన్నా ఇంట్లోనే నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం. • పాత జీన్ ప్యాంట్లను బస్తాలుగా కుట్టుకుంటే చాన్నాళ్లు మన్నికగా ఉంటాయి. వాటిపై అందమైన అల్లికలు చేయవచ్చు. • ఏవైనా కార్యక్రమాలు జరిగేటప్పుడు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలి. కాగితంతో చేసినవైనా మేలే. • అరటి, మోదుగ వంటి ఆకులతో చేసిన విస్తర్లలో భోజనం చేయడం అత్యుత్తమం. • హోటల్ నుంచి పార్శిల్ తెచ్చుకునేటప్పుడు మనమే డబ్బాలను పట్టుకెళ్తే మంచిది. • ఇప్పుడిప్పుడే మట్టిపాత్రలు, వస్తువుల ఉపయోగం పెరగడం ఆదర్శనీయం. ఇది మరింత విస్తరించాలి.





ముశ్రీఫా జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా వస్త్రంతో తయారు చేసిన సంచులు

మీకు తెలుసా?

• ప్రతి మనిషి నిత్యం సగటున 25 నుంచి 50 గ్రాముల ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

• ప్లాస్టిక్ రేణువులు శరీరంలో చేరి పేగుల్లో క్యాన్సర్‌కు కారణమవుతుంది. మెదడులో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి.

రేణువులు అవయవాలలో చేరుతున్నాయి



ప్లాస్టిక్ నానో రేణువులు తెలియకుండానే శరీరంలోని అన్ని అవయవాల్లోకి చేరుతున్నాయి. ఒకసారి శరీరంలోకి ప్రవేశిస్తే బయటకు రావు. కణ వ్యవస్థను దెబ్బతీస్తాయి. మనం తాగే శుద్ధ జలంలోనూ నానో ప్లాస్టిక్ రేణువులు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. చిన్నపిల్లలు ఐస్‌క్రీంలు, బేకరీ ఉత్పత్తులు తినేటప్పుడు నానో రేణువులు వెళ్లే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వస్తువుల్లో తినడం, తాగడానికి దూరంగా ఉండాలి.

- డా. శివకుమార్ సింగ్, సహాయ ఆచార్యులు, పాలమూరు విశ్వవిద్యాలయం

భూమాతకు ఎంత కష్టం



వస్తువు మట్టిలో కలిసేందుకు పట్టే సమయం

కూరగాయలు : 5 రోజుల నుంచి నెల **అరటి తొక్క :** 24 రోజులు **చెరకు పిప్పి :** 30- 60 రోజులు **కాగితం :** 20 రోజుల నుంచి అయిదు నెలలు **ఆకులు :** సంవత్సరం **సిగరెట్ పీక :** ఏడాది నుంచి పన్నెండేళ్లు **తోలు వస్తువులు :** 25 నుంచి 45 ఏళ్లు **నైలాన్ :** 30 - 40 సంవత్సరాలు **అల్యూమినియం వస్తువులు :** 80 ఏళ్లు **పాలిథిన్ కవర్లు :** 400 - వెయ్యి సంవత్సరాలు

రంగులతో ప్రమాదం



కవర్లకు కలిపే రసాయన రంగుల్లో ఆరోగ్యానికి హాని చేసే కాడ్మియం, సీసం వంటివి ఉన్నాయి. ఇవి నేలలో కరిగిపోవు. భూసారాన్ని కూడా నాశనం చేస్తాయి. ప్రతి ఏటా రెండు మిలియన్ల పక్షులు, సముద్రజీవులు ప్లాస్టిక్ కారణంగా చనిపోతున్నాయి. ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలి.

- వార్ల మల్లేశం, జాతీయ హరిత దళ సమన్వయకర్త

కానిస్టేబుల్‌పై ఎస్సైకి ఫిర్యాదు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బాధితుడికి సహకారం అందిస్తానని కానిస్టేబుల్ డబ్బులు వసూలు చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ.2వేలు వసూలు చేశాడు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం లిఖిత పూర్వకంగా ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఘటనపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కల్లు దుకాణాలపై నార్కోటిక్, పోలీసుల దాడులు

పలువురు నుంచి నమూనాల సేకరణ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారీ చేసి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు రాష్ట్ర నార్కోటిక్ అధికార బృందం గద్వాల పోలీసుల ఆధ్వర్యంలో గద్వాల నియోజకవర్గంలోని పలు కల్లు దుకాణాలపై దాడులు నిర్వహించాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.... గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, పూడూరు, మేలచెర్వు, మల్దకల్ మండలంలోని మద్దెలబండ, ధరూర్ మండలంలోని మరో రెండు గ్రామాల్లో కల్లు తాగుతున్న సుమారు 20 మందికి పైగా అదుపులోకి తీసుకుని వారి నుంచి నమూనాలు సేకరించారు. అధికారులు తమ వద్ద కొన్ని ఎక్విప్‌మెంట్ ద్వారా మూత్రం ద్వారా పరీక్షలు నిర్వహించగా కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించినట్టు పాజిటివ్ ఫలితాలు తేలినట్లు సమాచారం. ఇంకా పూర్తి స్థాయి నిర్ధారణకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి గద్వాల గ్రామీణ పోలీసులు కల్లు తాగిన వారిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. గద్వాల నియోజకవర్గంలో కొందరు కల్లు నిర్వాహకులు మత్తుపదార్థాలను వినియోగించి కల్లును విక్రయిస్తున్నారని కొందరు రాష్ట్ర ఆబ్కారీ, నార్కోటిక్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, మరి కొందరు కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు కల్తీ కల్లును అరికట్టేందుకు నార్కోటిక్ అధికారులు నాలుగు బృందాలుగా విడిపోయి దాడులు చేసినట్టు సమాచారం. కల్లులో మత్తు పదార్థాలు కలిపి తయారు చేసి విక్రయిస్తున్న కొందరి నిర్వాహకులపై సంబంధిత ఠాణాల్లో కేసు నమోదైనట్టు సమాచారం. దాడుల వివరాలు చెప్పేందుకు నార్కోటిక్ అధికారులు, గద్వాల పోలీసులు నిరాకరించారు. తాము సేకరించిన నమూనాల ఫలితాలను ప్రధాన కార్యాలయానికి నివేదిస్తామని నార్కోటిక్ అధికారులు చెప్పారు. అయితే ఇటీవల కల్లు దుకాణాలపై నార్కోటిక్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి పలువురి నిర్వాహకులపై కేసులు నమోదు చేయగా, శుక్రవారం మరోసారి దాడులు నిర్వహించడంతో నిర్వాహకులు కొందరు షాక్‌లో పడ్డారు.

ప్రజారోగ్యంతో ఆటలు



పేటలో స్టాంపింగ్ లేకుండానే విక్రయిస్తున్న మాంసం



చనిపోయిన గొర్రెల మాంసాన్ని అంటగట్టారంటూ కొందరు వినియోగదారులు నారాయణపేట మార్కెట్‌లో అమ్మకందారులతో ఇటీవల వాగ్వివాదానికి దిగారు. మాంసం విక్రయాల్లో నాణ్యత ఎంత ఘోరంగా ఉందో ఈ ఘటన అద్దం పడుతుంది. ఉమ్మడి జిల్లాలో మాంసం విక్రయాలను పరిశీలిస్తే అధికారులు దృష్టి సారించాల్సిన అంశాలెన్నో వెలుగు చూస్తున్నాయి.

న్యూస్‌టుడే- నారాయణపేట (పాతబస్టాండ్), మక్తల్ పట్టణం

ఉమ్మడి జిల్లాలో గొర్రె మాంసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆదివారం వస్తే మటన్ దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతుంటాయి. మాంసాన్ని వండుకోడానికి వీలుగా సిద్ధం చేసే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా అనారోగ్యానికి కారణం అవుతుంది. చాలావరకు విక్రయాల్లో నిబంధనలు పాటించడంలేదు. కొద్దిమంది మాత్రం పరిశుభ్రమైన మాసం అమ్ముతున్నారు. వధించే జీవాల ఆరోగ్యాన్ని ధ్రువీకరించాల్సిన పశువైద్యాధికారులు ఉమ్మడి జిల్లాలో దాదాపు లేరనే చెప్పాలి. జీవాలకు ట్యాగ్ వేసిన తరువాత కోయాలి. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా వరకు జంతువులు రోగాలబారిన పడ్డాయి. మరికొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాల్లో మేకలు, గొర్రెలు మృతిచెందాయి. అవి మాంసంగా మారి వస్తున్నా పట్టించుకునే నాథుడు లేరు. నగర, పురపాలికల్లోని ప్రజారోగ్య శాఖ అధికారులు కూడా తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

పెద్ద మొత్తంలో అమ్మకాలు

ఒక్కొక్క జిల్లాలో క్వింటాళ్ల కొద్దీ రోజూ మాంసం విక్రయాలు జరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దాదాపు 7 నుంచి 8 వందల జీవాలు వధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదివారం, పండగ వాటిసంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుంది. శాఖాపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజల్లోనూ అవగాహన ఉండాలని పశువైద్యాధికారి అనిరుధ్ అన్నారు. మాంసంలో ఏదైనా తేడా ఉంటే జీవాల చిన్నప్రేగుల్లో ఉండే సుమారు 3వేల రకాల సూక్ష్మజీవుల లార్వాలు అనేక రకాల వ్యాధులను కలిగించే అవకాశం ఉందని వనపర్తి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ మిరాజ్ అహ్మద్ అన్నారు.

నోటీసులు అందజేస్తాం..



రహదారులపైనా, ఆవాసాల మధ్యలో జంతువులను వధిస్తే కఠిన చర్యలు తప్పవు. అపరిశుభ్ర వాతావరణంలో ఇష్టానుసారంగా వ్యవహరించే వ్యాపారస్తులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఇప్పటికే మాంస విక్రయాలకు పరిశుభ్రత పాటించాలని సూచించాం. ఓసారి పరిశీలించి నోటీసులు ఇస్తాం. పద్ధతి మార్చుకోకుంటే చట్టప్రకారం చర్యలు తప్పవు.

-సునీత, పుర కమిషనర్, నారాయణపేట.

వధశాలలు ఏవీ?

కబేళాల్లోనే జీవాలు వధించాల్సి ఉన్నా పట్టించుకునేవారు కరవయ్యారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట, వనపర్తి, గద్వాలలో మాత్రమే వధశాలలు ఉన్నాయి. 14 మున్సిపాలిటీల్లో లేవు. అక్కడ ఇష్టారాజ్యంగా కోసి అమ్ముతున్నారు. మురుగుకాల్వల పక్కన, అపరిశుభ్ర వాతావరణంలో రోడ్డు పక్కన విక్రయాలు జరుగుతున్నాయి. జీవం కోసేటప్పుడు అది ఆరోగ్యంగా ఉన్నట్లు పశువైద్యాధికారి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణపత్రం మంజూరు చేయాలి. మాంసాన్ని శుభ్రపరిచాక ఇవ్వాలి. ఇవేవీ అమలు కావడం లేదు. కొన్ని చోట్ల వయసు పైబడిన, మరికొన్ని చోట్ల గొర్రె పిల్లలను నరికి విక్రయిస్తున్నారు.

వ్యర్థాలతో అనర్థం

జీవాలను కోసిన తరువాత వ్యర్థాలను రోడ్లపైకి, నదుల్లోకి, కాలనీల మధ్య పడేస్తున్నారు. దుర్వాసనకు దోమలు, పందులు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నారాయణపేట, కోస్గి, జడ్చర్ల వంటి ప్రాంతాల్లో ఈ విషయంలో మున్సిపల్ అధికారులకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. రహదారులపై దుమ్ము, ధూళి మాంసంపై పడుతోంది. జిల్లాలోని దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో మాంసం వ్యర్థాల కోసం వీధికుక్కలు ఎగబడుతున్నాయి. కాలనీల మధ్యలో వాటి సంచారం మూలంగా పలువురు కాట్లకు గురవుతున్నారు.

నల్లమలలో గుప్త నిధుల తవ్వకాలు!



లక్ష్మాపురం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

అమ్రాబాద్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం లక్ష్మాపురం పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల తవ్వకాల కోసం వచ్చిన కొందరిని గ్రామస్థులు పోలీసులకు అప్పగించిన సంఘటన కలకలం రేపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గురువారం సాయంత్రం కొందరు కారులో వచ్చి ప్రాథమిక పాఠశాల ఆవరణలో వాహనాన్ని నిలిపారు. అందులో కొందరు గ్రామ సమీప అడవిలోని నర్సింహస్వామి ఆలయం వైపు వెళ్లగా మరికొందరు గ్రామంలోనే తచ్చాడారు. గ్రామస్థులు అనుమానంతో ప్రశ్నించగా అటవీ అధికారులమని అడవిలో విద్యుత్తు కంచె వేస్తున్నట్లు సమాచారం రావటంతో పరిశీలించేందుకు వచ్చామని బుకాయించారు. రాత్రి 12 గంటలైనా కారు అక్కడే ఉండటంతో గ్రామస్థులు అనుమానంతో రాత్రి 1.30 గంటల సమయంలో అడవిలోకి వెళ్లి పరిశీలించారు. ఎదురు పడిన వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానం చెప్పారు. కొందరు పారిపోగా ఇద్దరిని పట్టుకొని ప్రశ్నిస్తుండగా పోలీసులు వచ్చి గ్రామస్థుల అధీనంలో ఉన్న వారిని, కారును, ద్విచక్రవాహనాన్ని ఠాణాకు తీసుకెళ్లారు. గ్రామస్థులు శుక్రవారం ఉదయం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఇదే బృందంలోని కొందరు ఇటీవల కొన్ని ప్రధాన ఆలయాలను పరిశీలించినట్లు సమాచారం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

• గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విచారణ చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి, మరో వ్యక్తి హరిని విచారించామని కారులో గాని వారి వద్ద గాని ఎలాంటి పరికరాలు లభించలేదన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00



సహాయకులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో రమేశ్

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేసి మాట్లాడారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరా చేసే పైపు లైన్లు, కుళాయిలు, గేట్‌వాల్వ్ మరమ్మతులను వాటర్‌మెన్‌లు చూసుకోవాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు ఉంటే వెంటనే సరిచేసి నీటి సరఫరా పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఏఈ శ్రీకాంత్, జేటీవో అశోక్, మంచినీటి సహాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సొసైటీ ప్రగతికి సహకారం అవసరం

ధన్వాడ, న్యూస్‌టుడే: ధన్వాడ మండలం నుంచి నారాయణపేట మార్కెట్ కమిటీకి డైరెక్టర్లుగా నియమితులైన కూరగాయల రాంచంద్రయ్య, జుట్ల లక్ష్మయ్యగౌడ్, రాగ్యానాయక్‌లను శుక్రవారం విండో పాలకవర్గం శాలువాలతో సత్కరించింది. ఈ సందర్భంగా విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ విండో బలోపేతానికి మార్కెట్ కమిటీ ద్వారా సహాయ సహకారాలు అందించాల్సిందిగా డైరెక్టర్లను కోరారు. ఉపాధ్యక్షుడు గండి బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ ఉమేశ్‌కుమార్, నాయకులు రూప్లానాయక్, సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రహ్మాన్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



నిడుగుర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని నిడుగుర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ కాంబ్లే మాట్లాడుతూ వృత్తిలో బదిలీలు సహజమేనని, అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ లత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: మక్తల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ భవనం వద్ద శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డీవీచారి, ప్రోగ్రాం అధ్యక్షుడు ఆదెం శ్రీనివాసులు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అలాగే పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంఈవో అనిల్‌గౌడ్‌ను సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో గ్రేటర్‌కుమార్, అంజన్‌ప్రసాద్, రాజుల ఆశిరెడ్డి, రవికుమార్, రమేష్, అంబదాస్, జైపాల్‌రెడ్డి, ఎస్ జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కృష్ణా, న్యూస్‌టుడే: కృష్ణా మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన నిజాముద్దీన్‌ను మంగళవారం ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉపాధ్యాయులు ఆయా గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. మండలానికి చాలా కాలం తర్వాత ఎంఈవోను నియమించడం శుభపరిణామమని అన్నారు. ఈ సందర్భంగా నిజాముద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని పిలుపునిచ్చారు.

నర్వ, న్యూస్‌టుడే: నర్వ మండల నూతన ఎంఈవో రామకృష్ణను శుక్రవారం ఎమ్మార్సీలో ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, టీఎస్‌యూటీఎఫ్ బాలు ఎమ్మార్సీ సిబ్బంది శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, పెండింగ్‌లో నిర్వహణలు, మధ్యాహ్న భోజన పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉత్సాహంగా జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని చింతలపేట ఇండోర్ స్టేడియంలో శుక్రవారం అండర్-14 విభాగంలో బాలుర జోనల్ స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ హాజరై మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు అంకితభావంతో ఆడి క్రీడా ప్రతిభను చాటాలని సూచించారు. పోటీలకు నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల నుంచి క్రికెట్ జట్టు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం ఆయా జిల్లాల నుంచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సంక్షేమంలో మహిళాభ్యున్నతి

ఊట్కూరు, న్యూస్‌టుడే: మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కాంగ్రెస్ మాజీ సర్పంచి బస్వరాజ్ గౌడ్ అన్నారు. పగిడిమారిలో శుక్రవారం మహాలక్ష్మి పథకం రూ. 500 రాయితీ గ్యాస్ సిలిండర్ పథకం ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివ, ఆసిఫ్, డీలర్ జయంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జూరాలకు పెరుగుతున్న వరద

ధరూరు న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వస్తున్న వరద పెరుగుతోంది. జలాశయంలోకి 1.33 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 15 గేట్లు ఎత్తివేసి ద్వారా 1.37 లక్షల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు. ఆల మట్టి జలాశయంలోకి 66వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 60వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయంలోకి 65వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 61వేల క్యూసెక్కుల వరద నీటిని వదులుతున్నారు.

రైతు, కూలీలకు ఉపాధి మధురిమ

సీతాఫలాల దిగుబడికి అవకాశం



పేటలో సీతాఫలాలు విక్రయిస్తున్న కూలీలు

న్యూస్‌టుడే, దామరగిద్ద

ప్రతి ఏటా సెప్టెంబరు నుంచి నవంబరు వరకు చేతికందే సీతాఫలాలు ఈ ప్రాంత రైతులు, కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండా ప్రభుత్వ భూములు, గుట్టలు, బీడు, బంజరు భూములు, రైతుల పొలాల గట్లపై విపరీతంగా సీతాఫలాల చెట్లు పెరగడం పేట జిల్లా ప్రత్యేకత. విత్తనాలు నేలపై పడితే కొత్త మొక్కలు పుడుతున్నాయి. మండల మహిళా సమాఖ్యలు వీటిని కొనుగోలు చేసి గుజ్జు తయారు చేస్తున్నారు. ఐస్‌క్రీం కంపెనీలు, పండ్ల రసాల దుకాణాలకు విక్రయిస్తున్నారు. మహిళా సమాఖ్యలకు పెట్టుబడిపోనూ లాభం మిగులుతోంది. దామరగిద్ద, మద్దూరు, నారాయణపేటల్లో గుజ్జు తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇవి సీజన్‌లో పనిచేస్తాయి. సమాఖ్య మహిళాలు రైతులు, కూలీల నుంచి కాయలు కొనుగోలు చేసి అవి మాగి పండ్లు అయ్యాక గుజ్జు తీస్తారు. దామరగిద్దలో శుక్రవారం కేంద్రం ప్రారంభమయ్యింది. వర్షాలకు దిగుబడి ఎక్కువగా ఈ సారి వచ్చే అవకాశం ఉంది. కిలో కాయలు ఏ గ్రేడ్ రూ. 13, బీ గ్రేడ్ రూ. 12 చొప్పున రైతులు, కూలీల నుంచి మహిళా సమాఖ్య కొనుగోలు చేస్తోంది. కొంతమంది నారాయణపేటలో ఎక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు. కనీసం కిలోకు రూ. 16నుంచి 18వరకు ఇవ్వాలని రైతులు, కూలీలు కోరుతున్నారు. గత ఏడాది దామరగిద్ద మహిళా సమాఖ్య 11,748 కిలోలు సేకరించి గుజ్జు తయారు చేసింది. 150 మంది రైతులు, కూలీలకు ఉపాధి లభించింది. ఈసారి పంట బాగుండటంతో మరింతమందికి ఉపాధి కలుగుతుంది. సీతాఫలం పంట పరంగా ఉపాధి అవకాశాలు మరింతగా పెంచడానికి అవకాశాలు చూస్తున్నామని డీఆర్డీవో మొగులప్ప అన్నారు.

పర్యాటకంలో పరుగు తీయాలి : కలెక్టర్



సమావేశానికి హాజరైన విద్యార్థులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా పర్యాటక పరంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా టూరిజం అధికారి రషీద్ అధ్యక్షతన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలు, జలవనరులు, ప్రాజెక్టులు, అటవీ ప్రాంతాలు పర్యాటకంగా ఆదరణ పొందుతున్నాయన్నారు. వ్యాసరచన, ఉపన్యాస , చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, ఆంగ్ల పదకోశాలు అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. క్లబ్ సమన్వయకర్త షఫిక్ అహ్మద్, అధ్యాపకులు రంగారెడ్డి, శ్రీనివాసులు, నారాయణగౌడ్, ఎండీ జానీ, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవ ర్యాలీ

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు సత్యనారాయణ కూడలి, వీరసావర్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. వీరసావర్కర్ కూడలిలో మానవహారంగా ఏర్పడి వయోవృద్ధుల సంక్షేమం కోసం పాటు పడతామని ఆర్డీవో మధుమోహన్ ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమాధికారిణి జయ, జీహెచ్‌ఎం వేణుగోపాల్, సీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నారాయణపేట: వానాకాలం పంటకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యాన్ని సేకరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 3.52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనావేసినట్లు అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలియజేశారు. తేమశాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్నీ బ్యాగులకు సంబంధించి మార్కెటింగ్ శాఖ అధికారులు ఇచ్చిన నివేదిక తప్పుగా ఉందని, సరిచేసి ఇవ్వాలని డీఎంవోను కలెక్టర్ ఆదేశించారు. దాదాపు వంద కొనుగోలు కేంద్రాలను 3వేల టార్పాలిన్లు అవసరమవుతాయని కలెక్టరు చెప్పారు. కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ పట్టణంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు యాసంగి మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనం ఎంపిక, శుద్ధి, విత్తేదూరం, ఎరువుల యజమాన్యం, కత్తెర పురుగు నివారణ, పంట కోత, నూర్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యాసంగిలో తక్కువ నీరు, ఖర్చుతో మొక్కజొన్న సాగు చేసి అధిక దిగుబడులు సాధించాల్సిందిగా సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ నగేశ్‌కుమార్, సునీల్‌కుమార్, సమీర్‌కుమార్, ఏవో దినకర్, ఏఈవో పరశురాం, రైతులు పాల్గొన్నారు.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి

ధన్వాడ, న్యూస్‌టుడే: 20 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఒక ఉపాధ్యాయుడి చొప్పున నియమించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మహేశ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలో ప్రధాన కార్యదర్శి నల్గొండ మహేష్‌తో కలిసి పర్యటించిన ఆయన కొండాపూర్‌లో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం పది మంది విద్యార్థులు ఉంటే ఒక ఉపాధ్యాయుడిని ఆ తర్వాత 60 మంది వరకు ఇద్దరిని సర్దుబాటు చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. పెండింగ్ డీఏలను దసరా కానుకగా అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింలు, మహిళా అధ్యక్షురాలిగా భారతిలను ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కాశన్న ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

అదనపు నియంత్రిక ఏర్పాటు చేయాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బొందల్‌కుంట గ్రామంలో అదనపు నియంత్రిక ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కొన్ని నెలలుగా లో వోల్టేజీ సమస్యతో ప్రతి నిత్యం నియంత్రిక వద్ద ఫీజులు కాలిపోయి విద్యుత్తు సరఫరా నిలిచిపోతుంది. శుక్రవారం సాయంత్రం రెండు గంటలపాటు సరఫరా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అదనపు విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రామక్రిష్ణను వివరణ కోరగా సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

‘కుల నిర్మూలనకు ఐక్యంగా పోరాడదాం’



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కృష్ణ

ఊట్కూరు, న్యూస్‌టుడే: సమాజంలో కుల వివక్ష కొనసాగుతోందని, కుల నిర్మూలనకు ఐక్యతగా పోరాడదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో శుక్రవారం జ్యోతిరావు పులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కుల నిర్మూలన సదస్సుకు హాజరై మాట్లాడారు. జ్యోతిరావు పులే సమాజంలో సమానత్వం, ప్రజల్లో ఐక్యత భావాన్ని పెంపొందించేందుకు కృషి చేశారని కొనియాడారు. పులే భార్య సావిత్రిబాయి మహిళల విద్య పెంపుకోసం కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి చిన్నబాలు, సి. అంజప్ప, పాఠశాల హెచ్‌ఎం నర్సింగప్ప, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నప్ప, నాయకులు కనకరాయుడు, కురుమూర్తి, అంజప్ప, లింగప్ప, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీకి ఘన నివాళి



ధన్వాడలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ధన్వాడ, న్యూస్‌టుడే: స్థానిక మార్కండేయ స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం పద్మశాలి సంఘం నాయకుల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చేనేత సహకారానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సంఘం అధ్యక్షుడు బాల్‌రాజు, కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు శివాజీ, బాలయ్య, వెంకట్రాములు, నాగార్జున, నరేందర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జక్లేర్, కర్ని, మంథన్‌గోడ్ గ్రామాల్లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని మెయిన్ బజార్ హనుమాన్ మందిర్ వద్ద శుక్రవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సామాజికవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మనోహర్, వై. విఠోబా, దివాకర్, రామకృష్ణ, ఆనంద్, రమేశ్ పాల్గొన్నారు.

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మక్తల్ పట్టణంలోని పురపాలిక సమావేశ మందిరంలో కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు, పురసిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీరాల సత్యనారాయణ, ఖాదర్‌ఖాన్, సురేశ్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని వినతి

ధన్వాడ, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు స్థానిక నడికూడలిలో స్థలాన్ని కేటాయించాలని కోరుతూ పద్మశాలి సంఘం నాయకులు శుక్రవారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సాయిప్రకాశ్, తహసీల్దారు సింధూజలకు వినతిపత్రం అందజేశారు. సంఘం తరఫున విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అనుమతి ఇస్తే ముందుకు వెళ్తామని వినతిలో కోరారు. వినతి అందజేసిన వారిలో సంఘం పెద్దలు బాల్‌రాజు, శ్రీనివాస్, వెంకట్రాములు, వెంకటేశ్, శివాజీ, భాస్కర్, వీరేశ్ కుమార్ తదితరులున్నారు.



మక్తల్: కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై భాగ్యలక్ష్మీ రెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుకునే వయస్సులో డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాలలో ఎవరైనా తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పీఎస్ఐ శివశంకర్, హెడ్ కానిస్టేబుల్ బలరాం, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షలు

మద్దూరు, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీమ్ పోలీసులు వెల్లడించారు. మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా, సైబర్ క్రైం, గృహహింస వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బలరాజ్, చెన్నయ్య, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థి ఉద్యమంలో పీడీఎస్‌యూది ఘన చరిత్ర



పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: విప్లవ విద్యార్థి ఉద్యమంలో పీడీఎస్‌యూకు ఘన చరిత్ర ఉందని ఆ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు కాలేశ్వర్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాము అన్నారు. సంఘం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పేటలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. సభలో పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు వక్తలు మాట్లాడారు. సంఘం ఏర్పడినప్పటి నుంచి అనేక పోరాటాలు చేసిందన్నారు. ఇంజినీరింగ్ విద్య, పేద బలహీన వర్గాలు చదువుకునే వసతి గృహాలు, ఉచిత బస్సు పాసులు, కాస్మోటిక్ ఛార్జీలు, పాలమూరులో యూనివర్సిటీ సాధించడం, పేట డిగ్రీ కళాశాల ప్రభుత్వ పరం చేయడంలో, సామాజిక అంశాలపై కుల, మత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. అంతకు ముందు పేటలోని ప్రధాన రహదారుల గుండా విద్యార్థులతో ప్రదర్శన, అరుణోదయ కళాకారులు డప్పు ప్రదర్శన ఆటపాటలతో ధూంధాం నిర్వహించారు. సభలో పీడీఎస్‌యూ నాయకులు దేవేందర్, అంబదాస్, రెడ్డప్ప, మోహన్, ప్రతాప్, భాస్కర్, అజయ్, వెంకటేశ్, మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రాల పేరుతో మోసం

నకిలీ బాబా అరెస్టు



మహ్మద్ ఇల్యాస్ అహ్మద్

కేశవగిరి, న్యూస్‌టుడే: రోగాలు నయం చేస్తా.. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేస్తా.. సమస్యలు దూరం చేస్తా.. అంటూ నమ్మబలికి ప్రజలను మోసం చేస్తున్న నకిలీ బాబాను బండ్లగూడ పోలీసులతో కలిసి, సౌత్ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేటకు చెందిన మహ్మద్ ఇల్యాస్ అహ్మద్(42) వృత్తిరీత్యా ఇస్త్రీ పనిచేస్తుంటారు. భూత వైద్యంలో కొన్ని మెలకువలు నేర్చుకున్నాడు. 2012లో నగరానికి జీవనోపాధికి వచ్చిన ఆయన పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో నివసించాడు. ఆయా ప్రాంతాలలో భూత వైద్యుడు(బాబా)గా అవతారమెత్తాడు. తనకు అతీత శక్తులున్నాయని.. మీ సమస్యలన్నీ ఇట్టే తీరుస్తానని ప్రచారం చేసుకున్నాడు. తన వద్దకు వచ్చిన అమాయకులకు మాయమాటలు చెప్పి, భయభ్రాంతులకు గురిచేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. రెండు నెలల క్రితం పాతబస్తీ బండ్లగూడ జహంగీరాబాద్‌లో అద్దెకు ఇల్లు తీసుకుని దందా ప్రారంభించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.ప్రసాద్‌వర్మ, బండ్లగూడ రాణా ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు ఎం.మధు, షేక్ కవియుద్దీన్, పి.సాయిరాం, సిబ్బంది ఆయన ఇంటిపై దాడిచేశారు. ఇల్యాస్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంట్లో నుంచి అనుమానిత వస్తువులు, నిమ్మకాయలు, దారాలు, దీపంతలు, తాయెత్తులు, చిత్రపటాలు, ఫొటోలు, రూ. 8 వేల నగదు, చరవాణి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితుడికి బండ్లగూడ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసునమోదు చేసి రిమాండుకు తరలించారు.

చిరుతపులి దాడిలో దూడ మృతి

ధన్వాడ, న్యూస్‌టుడే: మండలంలోని మందిపల్లి గ్రామానికి చెందిన కోటకొండ రాములుకు చెందిన దూడ గురువారం రాత్రి చిరుతపులి దాడిలో మృతి చెందింది. ఈర్లగట్టు శివారులో ఉన్న పొలం వద్ద కట్టేసి ఇంటికి రాగా చిరుతపులి కొట్టంలోకి దూరి దూడను లాక్కెళ్లి చంపేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖాధికారులు చిరుత జాడల్ని గుర్తించారు. సంఘటన విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఒంటరిగా మాత్రం గుట్టల వైపు వెళ్లవద్దని బీట్ అధికారులు మల్లేశ్, వినయ్ సూచించారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

కృష్ణా, న్యూస్‌టుడే : కృష్ణా మండలం ఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన తారేశ్‌ను పోలీసులు లొకేషన్ ఆధారంగా కనిపెట్టి ప్రాణాలు కాపాడారు. కుటుంబ కలహాలతో తారేశ్ శుక్రవారం ఉదయం 8 గంటలకు పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగి పోలీసులకు ఫోన్ చేశాడు. వెంటనే స్పందించిన కానిస్టేబుల్ రామ్‌తేజ, భరత్‌లు వెంటనే గ్రామంలోని పెద్దలను అప్రమత్తం చేసి లొకేషన్ తెలియచేశారు. స్వయంగా వెళ్లి అతనిని మాగనూరులోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్లు కృష్ణా ఎస్ఐ ఎస్ఎం నవీద్ తెలిపారు.



ఫుట్‌బాల్ జట్టుతో ఎస్‌జీఎఫ్ అధికారులు

జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి

ధన్వాడ, న్యూస్‌టుడే: గద్వాల పట్టణంలోని ఎస్ఆర్ విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి 17 ఏళ్లలోపు ఫుట్‌బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టు తరపున పాల్గొన్న క్రీడాకారులందరూ ధన్వాడ మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులే. అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించడం పట్ల గురుకుల ప్రిన్సిపల్ రాజారాం, పీడీ, కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సిములు విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ఎన్నిక

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల అసోసియేషన్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి, అసోసియేషన్ ఎన్నికల అధికారి సుదర్శన్‌రావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా దత్తత్రిరావు, కోశాధికారిగా సాయినాథ్, మహిళ ప్రతినిధిగా ఉషారాణి, కార్యనిర్వహక సభ్యుడు నర్సింహారెడ్డిని ఎన్నుకున్నట్లు వివరించారు.

సఫాయి కార్మికులకు వైద్య పరీక్షలు

మాగనూరు, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రహ్మతుద్దీన్ తెలిపారు. అంతకు ముందు మండల పరిషత్ కార్యాలయం వద్ద నీటి శుద్ధి శిక్షణ పూర్తి చేసుకున్న సహాయకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఏఈ శ్రీకాంత్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలి



కళాశాలలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హెచ్.సుదర్శన్‌రావు

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా అధికారి హెచ్. సుదర్శన్ రావు సూచించారు. ఊట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేసి మాట్లాడారు. తరగతి గదులు, నిర్వహణ దస్త్రాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యాపకులు సత్యనారాయణ, బసయ్య, మంజునాథ్, కల్పన, అశోక్, మహేశ్, చరిత పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై మహాగర్జన

నర్వ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై హైదరాబాద్‌లో ఈనెల 28న జరగనున్న మహాగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నర్వలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాపంగా కళాశాల, యూనివర్సిటీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ కింద రావాల్సిన నిధులను ప్రభుత్వ విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాఘవేంద్ర, కురుమూర్తి, రాము తదితరులు పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం

ధన్వాడ, న్యూస్‌టుడే: స్థానిక పాత గ్రామ పంచాయతీ ఆవరణలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపినట్లు ప్రత్యేకాధికారి సాయిప్రకాశ్ శుక్రవారం వెల్లడించారు. గురువారం వారాంతపు సంతలో మూత్రశాలలు నిర్మించాలని కోరుతూ యువకులు, మహిళలు ప్లకార్డుల ప్రదర్శనతో నిర్వహించిన ధర్నా విషయాన్ని ప్రస్తావిస్తూ నిధులు మంజూరు కాగానే సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. సమావేశంలో కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం అన్నారు. శుక్రవారం పేట సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ.. సెప్టెంబరు 28న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కావున వివిధ శాఖల కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, జోషి పాల్గొన్నారు.

30 నుంచి చంద్రగురుస్వామి ఆరాధన ఉత్సవాలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రం వీరన్నపేటలోని పెద్దశివాలయ ప్రాంగణంలో ఈనెల 30 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యుడు పోతుల రాంరెడ్డి వెల్లడించారు. వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. చివరి రోజు పట్టణంలో చంద్రగురుస్వామి పల్లకి సేవ ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

బకాయి బిల్లులకు మోక్షం

గద్వాల, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో తాజా మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి సుమారు ఎనిమిది నెలలు కావస్తోంది. సర్పంచులుగా కొనసాగిన సమయంలో వాళ్లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. ఎనిమిది నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో రాష్ట్ర సర్పంచుల సంఘం తరఫున ఈ అంశంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం బిల్లులు చెల్లించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో యంత్రాంగంలో కదలిక వచ్చింది.

- బిల్లుల వివరాలను వెంటనే నివేదించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇటీవల ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో ఆయా పంచాయతీల్లో తాజా మాజీ సర్పంచులు చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లుల పూర్తి వివరాల నివేదికను పంచాయతీ కార్యదర్శులు, డీపీవోలకు అందించడానికి కసరత్తు చేస్తున్నారు. నివేదికలు చేరగానే బిల్లుల చెల్లింపు మొదలయ్యే అవకాశం ఉంది.
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,684 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 10వేల జనాభా పైబడిన పంచాయతీల్లో రూ. 30 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉండగా 5 వేల జనాభా పైన పంచాయతీల్లో రూ. 20 లక్షల వరకు ఉన్నాయి. 3 వేల జనాభా ఉన్న పంచాయతీల్లో రూ. 8-10 లక్షలు, 2 వేల లోపు జనాభా ఉన్న పంచాయతీల పరిధిలో రూ. 5 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు తెలుస్తోంది. పెండింగ్ బిల్లులు సుమారు రూ. 170 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం.